

ఆసిఫాబాద్ కలెక్టరేట్‌లో జెండా వందనం చేస్తున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే



హాజీపూర్ : పోలీస్ బెటాలియన్‌లో జెండా ఎగురవేస్తున్న కమాండెంట్ వెంకట్రాములు



జెండా వందనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



జెండా ఆవిష్కరిస్తున్న బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

# అంబరాన్నంటిన 'స్వాతంత్ర్య' సంబురాలు

**మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు గురువారం కనుల పండువగా జరిగాయి. ఊరూరా త్రివర్ణ పతాకాలు రెపరెపలాడాయి. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పలు కూడళ్లు, గ్రామ పంచాయతీ కార్యాలయాలు, పార్టీల జెండా గద్దెల వద్ద, విద్యాసంస్థల్లో అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు జెండాలను ఎగురవేశారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను కొనియాడారు. మిఠాయిలు పంచి శుభాకాంక్షలు తెలిపారు.**



జడ్పీ కార్యాలయంలో జెండా ఎగురవేస్తున్న మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్



బీఆర్ఎస్ కార్యాలయంలో జెండా వందనం చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి, నాయకులు



మంచిర్యాలలో జెండా ఎగురవేస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

### మహనీయుల త్యాగాలు ఎన్నటికీ మరువలేనివి -బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్

సీసీసీ నస్పూర్, ఆగస్టు 15: దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయుల త్యాగాలు ఎన్నటికీ మరిచిపోలేనివని బీఆర్ఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ పేర్కొన్నారు. నస్పూర్‌లోని మంచిర్యాల బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ మహనీయుల చిత్రపటాలకు పూలమాలతో నివాళులర్పించారు. అనంతరం ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసే వరకూ ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ బాధ్యత తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు నడిపెల్లి దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్య, నాయకులు నడిపెల్లి విజిత్‌రావు, డాక్టర్ రాజారమేశ్, అత్తి సరోజ, గోగుల రవీందర్‌రెడ్డి, పల్లె భూమేశ్, అక్కూరి సుబ్బయ్య, మెరుగు పవన్, ఈసంపల్లి ప్రభాకర్, కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, బడికెల సంపత్‌కుమార్, పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

**సీసీసీ నస్పూర్, ఆగస్టు 15:** సీసీసీ కార్నర్ వద్ద ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు, నస్పూర్ కాలనీలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. మున్సిపల్, తహసీల్ కార్యాలయాల్లో అధికారులు, నాయకులు జెండాలను ఆవిష్కరించారు.

**పోలీస్ బెటాలియన్‌లో..**

హాజీపూర్, ఆగస్టు 15 : మండలంలోని గుడిపేటలోని 13వ ప్రత్యేక తెలంగాణ పోలీస్ బెటాలియన్‌లో కమాండెంట్ వెంకట్రాములు జెండా ఆవిష్కరించారు. జడ్పీ కార్యాలయంలో ప్రత్యేక అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ ఆవిష్కరించారు. టీఎన్జీవో భవన్‌లో జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు.

**మంచిర్యాల జిల్లా కేంద్రంలో..**

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 15: మంచిర్యాల డీసీపీ కార్యాలయంలో డీసీపీ భాస్కర్, అటవీ శాఖ అధికారి కార్యాలయంలో కంజర్వేటర్ (సీఎఫ్) శాంతారాం, జిల్లా ప్రభుత్వ జనరల్ దవాఖానలో సూపరింటెండెంట్ డా.హరిశ్చంద్రారెడ్డి, జిల్లా రవాణ శాఖ అధికారి కార్యాలయంలో ఇన్‌చార్జి డీటీవో సంతోష్ జెండాలను ఆవిష్కరించారు. ఆటో ఓనర్స్, డ్రైవర్స్ అసోసియేషన్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

**మంచిర్యాలటౌన్/లక్షెట్టిపేట/ దండేపల్లి/ జన్నారం ఆగస్టు15:** మంచిర్యాల పట్టణంలో ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, విద్యాసంస్థలు, వ్యాపార, వాణిజ్య సంస్థలు, రాజకీయ పార్టీల నాయకులు జాతీయ జెండాలను ఆవిష్కరించారు. ఎల్ఐసీ కాలనీలోని తన నివాసం వద్ద మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. గాంధీపార్కు , మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య ఆవిష్కరించారు. లక్షెట్టిపేట, దండేపల్లి, జన్నారం మండలాల్లోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో అధికారులు, నాయకులు జెండాలను ఆవిష్కరించారు.

**బెల్లంపల్లి నియోజకవర్గంలో..**

బెల్లంపల్లి, ఆగస్టు 15 : బెల్లంపల్లి మున్సిపల్ కార్యాలయం, తాళ్లగురిజాల బస్టాండ్ ఆవరణ, కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. టీబీజీకేఎస్ కార్యాలయం, రెండవ వార్డులో మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆవిష్కరించారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు రేణికుంట్ల ప్రవీణ్ కాంటా ఏరియా, స్టేట్ బ్యాంకు, శాంతిఖని ఆటో స్టాండ్‌ల వద్ద, జనహిత సేవాసమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 50 అడుగుల జాతీయ జెండాను మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత జండా ఆవిష్కరించారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, విద్యా సంస్థల్లో ఆయా శాఖల అధికారులు, నాయకులు, ప్రిన్సిపాళ్లు జెండాలను ఆవిష్కరించారు.

**తాండూర్, ఆగస్టు 15 :** మండలంలో తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, మండల స్పెషల్ ఆఫీసర్ కటకం అంజయ్య, సీఐ కే కుమారస్వామి, తాండూర్, మాదారం ఎస్ఐలు డీ కిరణ్‌కుమార్, సౌజన్య, ఎంఈవో వాసాల ప్రభాకర్, ట్రాన్స్‌కో ఏఏఈ ప్రభాకర్, వ్యవసాయ శాఖ ఏవో కిరణ్మయి, సింగిల్ విండో చైర్మన్ సుబ్బ దత్తుమూర్తి, వివిధ శాఖల అధికారులు వారి కార్యాలయాల్లో జెండాలను ఆవిష్కరించారు.

**కన్నెపల్లి/ వేమనపల్లి/ కాసిపేట/ తాండూర్,ఆగస్టు 15 :** స్వాతంత్ర్య దినం సందర్భంగా కన్నెపల్లి, వేమనపల్లి, కాసిపేట, తాండూర్ మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో అధికారులు, నాయకులు జెండాలను ఆవిష్కరించారు.

**కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో..**

ఆసిఫాబాద్ టౌన్, ఆగస్టు 15 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, బీఆర్ఎస్ కార్యాలయంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి జెండా ఎగురవేశారు. జిల్లా గ్రంథాలయంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, ఎస్పీ కార్యాలయంలో జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు జెండాలను ఎగురవేశారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో వేడుకలను ఘనంగా నిర్వహించారు.

**వాంకిడి/సిర్పూర్(యూ)/జైనూర్/రెబ్బెన / కెరమెరి, ఆగస్టు15:** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను వాంకిడి, సిర్పూర్(యూ), జైనూర్, రెబ్బెన, కెరమెరి మండలాల్లోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో అధికారులు, నాయకులు, ఉపాధ్యాయులు జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

**సిర్పూర్ నియోజకవర్గంలో..**

కాగజ్‌నగర్, ఆగస్టు 15: కాగజ్‌నగర్ పట్టణంలో గాంధీ పార్కులో, ఎమ్మెల్యే నివాసంలో, ప్రజా కార్యాలయంలో సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు జెండా ఆవిష్కరించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ రాజీవ్ గాంధీ చౌరస్తాలో, డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ కరుణాకర్ జాతీయ జెండాలను ఆవిష్కరించారు. పలు కార్యాలయాల్లో.. అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల, ప్రజా, కుల సంఘాల నాయకులు, పోలీసు అధికారులు జెండాలను ఆవిష్కరించారు.

**పలు మండలాల్లో..**

**సిర్పూర్(టీ) /బెజ్జూర్/కౌటాల/చింతలమానేపల్లి/ దహెగాం/పెంచికల్ పేట్, ఆగస్టు 15 :**

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను సిర్పూర్(టీ), బెజ్జూర్, కౌటాల, చింతలమానేపల్లి దహెగాం పెంచికల్ పేట్ మండలాల్లోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, విద్యాసంస్థలు, ప్రజా సంఘాలు, వివిధ పార్టీల కార్యాలయాల్లో అధికారులు, నాయకులు, ఉపాధ్యాయులు జెండాలను ఆవిష్కరించారు.

**చెన్నూర్ నియోజకవర్గంలో..**

చెన్నూర్ టౌన్, ఆగస్టు 15 : చెన్నూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ జెండాను ఎగురవేశారు. మున్సిపల్ కార్యాలయంలో చైర్ పర్సన్ అర్చనా గిల్డా, ఎంపీడీవో కార్యాలయంలో డీపీవో డీ వెంకటేశ్వర్ రావు జెండాలను ఆవిష్కరించారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో జెండాలను ఆవిష్కరించారు.

**పలు మండలాల్లో..**

**మందమర్రి/జైపూర్/మందమర్రి రూరల్ /కోటపల్లి/ భీమారం, ఆగస్టు 15:** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను మందమర్రి, జైపూర్, కోటపల్లి, భీమారం మండల కేంద్రాలతో పాటు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో అధికారులు, నాయకులు, ఉపాధ్యాయులు జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



మున్సిపల్ కార్యాలయంలో జెండా ఎగురవేస్తున్న బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్



వేడుకల్లో పాల్గొన్న సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు



చెన్నూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జెండా ఎగురవేస్తున్న ఎంపీ గడ్డం వంశీకృష్ణ



తాండూర్ : విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న తహసీల్దార్, నాయకులు

## ఘనంగా మాజీ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



దివాకర్‌రావుకు కేక్ తినిపిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్

సీసీసీ నస్పూర్, ఆగస్టు 15: మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు జన్మదిన వేడుకలను నస్పూర్‌లోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో దివాకర్‌రావు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా దివాకర్‌రావుకు పార్టీ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్, బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య శాలువా కప్పి కేక్ తినిపించి బర్త్‌డే శుభాకాంక్షలు తెలిపారు. దివాకర్‌రావు ఆయురారోగ్యాలతో ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నడిపెల్లి విజిత్‌రావు, డాక్టర్ రాజారమేశ్, అత్తి సరోజ, గోగుల రవీందర్‌రెడ్డి, పల్లె భూమేశ్, అక్కూరి సుబ్బయ్య, మెరుగు పవన్, కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, పెట్టం లక్ష్మణ్, బడికెల సంపత్‌కుమార్, పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

**మంచిర్యాల పట్టణంలో..**

మంచిర్యాలటౌన్, ఆగస్టు 15: మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావుకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ కౌన్సిలర్లు ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్‌చేసి తినిపించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ పెంట రాజయ్య, కౌన్సిలర్లు గాదె సత్యం, అంకం నరేశ్, నాయకులు నడిపెల్లి విజిత్‌రావు, ఎర్రం తిరుపతి, పడాల రవీందర్, తాజుద్దీన్, పెంట సత్యం, తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానానికి ముందుకు రావాలి



రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న అదనపు కలెక్టర్ మోతీలాల్

తాండూర్, ఆగస్టు 15 : రక్తదానం చేసేందుకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని, రక్తదానంతో ఆపదలో ఉన్నవారి ప్రాణాలు కాపాడవచ్చని మంచిర్యాల అదనపు కలెక్టర్ సభావాత్ మోతీలాల్ పిలుపునిచ్చారు. తాండూర్ మండల కేంద్రంలోని సురభి ఫంక్షన్ హాల్‌లో రెడ్ క్రాస్ సొసైటీ, తాండూర్ మండల రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ తో కలిసి సందర్శించారు. ఈ శిబిరంలో 201యూనిట్ల రక్తదానం చేయడంపై తాండూర్ రెవెన్యూ శాఖ ఉద్యోగులను అభినందించారు. అనంతరం రక్తదాతలకు సర్టిఫికెట్లు అందించారు. అనంతరం ఉత్తమ ఆర్డీవోగా ఎంపికైన బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణను సత్కరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్, ఎంపీడీవో పీ శ్రీనివాస్, తాండూర్ సీఐ కే కుమారస్వామి, డిప్యూటీ తహసీల్దార్ వీవీఆర్‌కేడీ ప్రసాద్, ఆర్ఐలు అంజన్ కుమార్, మురళీధర్, విద్యా భారతి విద్యాసంస్థల వ్యవస్థాపకుడు సురభి ఆగమరావు, డైరెక్టర్, రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జి సురభి శరత్‌కుమార్, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఎంసీ మెంబర్ అభినవ సంతోష్ కుమార్, పీఈటీ తొగరు శ్రీనివాస్, మండలంలోని అధికారులు, నాయకులు, యువకులు, రక్తదాతలు, తాండూర్ పీహెచ్‌సీ, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇందిర మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభం

నస్పూర్, ఆగస్టు 15 : నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో డీఆర్డీవో పరిధిలోని స్నేహలత గ్రామైక్య సంఘం (హాజీపూర్) ఆధ్వర్యంలో ఇందిర మహిళా శక్తి పథకంలో భాగంగా రూ.6 లక్షల రుణ సదుపాయంతో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ కుమార్ దీపక్, అటవీ అధికారి శివ్‌ఆశిష్‌సింగ్, డీసీపీ భాస్కర్, డీఆర్డీవో కిషన్, డీపీవో వెంకటేశ్వర్ రావు, తదితరులున్నారు

## బహుమతుల అందజేత



బహుమతులు అందజేస్తున్న రేయిన్‌బో స్కూల్ కరస్పాండెంట్

సీసీసీ నస్పూర్, ఆగస్టు 15: 68వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేతలకు సీసీసీ నస్పూర్ రేయిన్‌బో పాఠశాల కరస్పాండెంట్ చెన్నూరి అమన్‌ప్రసాద్, ప్రిన్సిపాల్ రజినీతో కలిసి బహుమతులు ప్రదానం చేశారు. నస్పూర్ మున్సిపాలిటీలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులకు పారిశుధ్యం, మొక్కల పెంపకం, వ్యక్తిగత పరిశుభ్రత, ప్లాస్టిక్‌వాడకం, సీజనల్ వ్యాధులపై నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో గెలుపొందిన 36 మంది విద్యార్థులకు కమిషనర్ చిట్యాల సతీశ్‌తో కలిసి చైర్మన్ సుర్మిళ్ల వేణు ప్రశంసాపత్రాలను అందజేశారు.

## ఉత్తమ ప్లాంటేషన్ మేనేజర్‌గా సురేశ్ కుమార్

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 15: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ (టీజీఎఫ్‌డీసీ) ప్రకటించిన అవార్డుల్లో ఉత్తమ ప్లాంటేషన్ మేనేజర్‌గా మంచిర్యాల రేంజ్ ప్లాంటేషన్ మేనేజర్ గోగు సురేశ్ కుమార్ ఎంపికయ్యారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లోని అటవీ అభివృద్ధి సంస్థ ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సంస్థ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డా.చంద్రశేఖర్ రెడ్డి చేతుల మీదుగా ప్రశంసా పత్రం, నగదు రివార్డును అందుకున్నారు. ఆయనను డివిజనల్ మేనేజర్ శ్రావణి, ప్లాంటేషన్ మేనేజర్లు, సిబ్బంది అభినందించారు.

## వైద్య విద్యార్థుల నిరసన

ఆసిఫాబాద్ టౌన్, ఆగస్టు 15:జిల్లా కేంద్రంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలలో గురువారం వైద్య విద్యార్థులు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సతీశ్‌తో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కలకత్తాలో వైద్యురాలిపై లైంగికదాడి ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం చొరవ తీసుకుని నేరస్తులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు సత్యం, ప్రియదర్శిని, సిబ్బంది ,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మంచిర్యాల డీసీపీకి ఐపీఎస్ హోదా

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 15: మంచిర్యాల డీసీపీ భాస్కర్‌కు ఐపీఎస్ హోదా వరించింది. 2010వ సంవత్సరంలో గ్రూప్ -1 అధికారిగా పోలీస్ డిపార్ట్‌మెంట్ చేరిన ఆయన సీనియార్టీ కలిగిన అధికారిగా గుర్తిస్తూ రాష్ట్ర పోలీస్ శాఖ నుంచి ఐపీఎస్‌కు ఆయనను ఎంపిక చేస్తూ ప్రతిపాదనలు పంపగా సెలక్షన్ కమిటీ చేసిన సిఫారసుల మేరకు యూపీఎస్సీ ఐపీఎస్ హోదాను ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## రూటర్ దొంగ అరెస్ట్

లక్షెట్టిపేట, ఆగస్టు 15: ఈ నెల 9న లక్షెట్టిపేట పట్టణంలోని ఆంధ్రబోర్ అశోక హోటల్ సమీపంలో ఉన్న జియో టవర్‌లో రూటర్ దొంగతనం చేసిన నిందితుడిని అరెస్ట్ చేసినట్లు పట్టణ ఎస్ఐ సతీశ్ తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం బీహార్‌కు చెందిన హిషామొద్దీన్ బీహార్‌లో సెల్ టవర్స్ టెక్నికల్‌గా ప్రైవేట్‌గా పని చేసేవాడు. వచ్చిన డబ్బులు సరిపోకపోవడంతో సెల్ టవర్‌లో రూటర్లు దొంగలించి బీహార్‌లో విక్రయించి సొమ్ము చేసుకునేవాడు. గురువారం ఆంధ్రబోర్‌లో అనుమానాస్పదంగా తిరుగుతుండగా లక్షెట్టిపేట ఎస్ఐ-2 రామయ్య అదుపులోకి తీసుకొని విచారించారు. దొంగతనం ఒప్పుకోవడంతో నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పర్చినట్లు తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువతి మృతి

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 5: ఆర్టీసీ బస్సు అతి వేగం, డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా మంచిర్యాల జిల్లా కేంద్రంలో వెంకటేశ్వర థియేటర్ చౌరస్తాలో ఉన్న ఐలాండ్ వద్ద ఈ నెల 5న జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడగా మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. తలకు తీవ్రగాయమైన రేగుంట దీప (24)ను స్థానికులు మంచిర్యాలలోని ప్రైవేట్ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్‌లోని చెల్మెడ దవాఖానకు తరలించి బ్రెయిన్ ఆపరేషన్ నిర్వహించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని యశోద హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందించారు. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ప్రమాదంలో గాయపడిన మృతురాలి తండ్రి రేగుంట రమేశ్ కరీంనగర్ చల్మెడా దవాఖానలో చికిత్స పొందుతున్నారు. ఈ కేసును మంచిర్యాల పోలీస్ స్టేషన్ ఎస్ఐ దర్యాప్తు చేస్తున్నారు.

### చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

హాజీపూర్, ఆగస్టు 15 : మండల కేంద్రంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో చికిత్స పొందుతూ మహిళ మృతి చెందినట్లు హాజీపూర్ ఎస్ఐ గోపతి సురేశ్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం నేషనల్ హైవే రోడ్డును దాటుతున్న చిప్పకుర్తి పోషమ్మ (68)ను కారు ఢీ కొనడంతో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు అంబులెన్స్‌లో మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతురాలికి కుమారుడు, నలుగురు కూతుళ్లున్నారు. మృతురాలి అల్లుడు మల్యాల రవి ఫిర్యాధు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### డీమార్ట్‌లో గుండెపోటు..వృద్ధుడి మృతి

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 15: మంచిర్యాలలోని క్వారీరోడ్డులో ఉన్న డీమార్ట్‌కు మంచిర్యాల హైటెక్‌సిటీకి చెందిన మొగులూరి సాయిబాబా (60) షాపింగ్‌కు వచ్చాడు. ఒక్కసారిగా గుండె నొప్పి రావడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. స్థానికులు వెంటనే ప్రభుత్వ దవాఖానకు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు.

## కోట్రంగి శ్యామ్‌రావు మృతదేహానికి రీ పోస్టుమార్టం

కాగజ్‌నగర్, ఆగస్టు 15: కాగజ్‌నగర్ మండలంలోని బురదగూడ గ్రామానికి చెందిన కోట్రంగి శ్యాంరావు (అలియాస్ సాంబయ్య) (36) ఈ నెల 3న మృతి చెందిన విషయం తెలిసిందే. ప్రమాదవశాత్తు మంచంపై నుంచి పడి మృతి చెందాడని తల్లి భీంబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కాగజ్‌నగర్ రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం కుటుంబసభ్యులు దహన సంస్కారాలు పూర్తి చేశారు. ఇంట్లో జరిగిన గొడవ కారణంగానే శ్యాంరావు మృతి చెందినట్లు జిల్లా పోలీసు అధికారులకు సమాచారం అందింది. ఈ నెల 10న జిల్లా పోలీసు అధికారుల ఆదేశాల మేరకు కాగజ్‌నగర్ రూరల్ పోలీసులు మళ్లీ విచారణ చేపట్టారు. వైద్యం అందించిన వైద్యులు, ఫోరెన్సిక్ అధికారులతో కలిసి వివరాలు సేకరించారు. కోట్రంగి శ్యాంరావు మృతిపై పలు అనుమానాలు వ్యక్తం కావడంతో శుక్రవారం ఆర్డీవో సురేశ్, ఫోరెన్సిక్ బృందం సమక్షంలో వీడియో చిత్రీకరిస్తూ మృతదేహాన్ని వెలికి తీసి రీ పోస్టు మార్టం నిర్వహించనున్నట్లు సమాచారం.

## కుటుంబ కలహాలతో ఒకరి ఆత్మహత్య

ఆసిఫాబాద్ టౌన్, ఆగస్టు 15 : భార్యాభర్తల మధ్య గొడవతో వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో జరిగింది. స్థానిక ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వావుదాం గ్రామానికి చెందిన కుర్సింగ ఆత్మరామ్ (30)కు ఇద్దరు కుమారులు ఉండగా పెద్ద కుమారుడు గతంలో అనారోగ్యంతో మరణించాడు. ఈ బాధతో ఆయన మద్యానికి బానిస అయ్యాడు. బుధవారం చిన్న కుమారుడి తీసుకొని బైక్‌పై జిల్లా కేంద్రానికి వచ్చి తిరిగి వస్తున్న క్రమంలో గ్రామ సమీపంలో అదుపుతప్పి పడిపోయారు. కుమారుడికి స్వల్ప గాయాలయ్యాయి. ఇద్దరు ఇంటికి వెళ్లగానే భార్య రుక్మిణి మద్యం తాగి బైక్ నడిపి కుమారుడిని కింద పడేశావంటూ మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన ఆత్మారాం పురుగుల మందు తాగాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు దవాఖానకు తీసుకువచ్చే లోపు చనిపోయాడు. భార్య రుక్మిణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ఉరేసుకొని వృద్ధుడు..

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 15: ఉరి వేసుకొని ఓ వ్యక్తి మృతి చెందినట్లు మంచిర్యాల పట్టణ ఎస్ఐ సనత్ కుమార్ తెలిపారు. గురువారం తెలిపిన వివరాల ప్రకారం మంచిర్యాల అశోక్‌రోడ్డుకు చెందిన లెక్కల మహేశ్ (60) కొద్ది రోజులుగా మద్యానికి బానిసై ఏ పని చేయకుండా ఉంటున్నాడు. గురువారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంట్లోనే ఉరి వేసుకొని మృతి చెందినట్లు కొడుకు రామాంజనేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు

## మద్యానికి బానిసై యువకుడు..

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 15:ఉరివేసుకొని ఓ వ్యక్తి మృతి చెందినట్లు మంచిర్యాల ఎస్ఐ రాములు తెలిపారు. గురువారం వారు తెలిపిన వివరాల ప్రకారం మంచిర్యాల జాఫర్ నగర్‌కు చెందిన శుభం మండల్ (26) తాగుడికి బానిసై ఏ పని చేయకపోవడంతో పండుగ ఉందని చెప్పి భార్య అంజూం మండల్ పది రోజుల క్రితం ఈజ్‌గాకుం వెళ్లింది. ఈ క్రమంలో మద్యం మత్తులో బుధవారం సాయంత్రం ఉరి వేసుకున్నాడని గురువారం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి కుమారుడు, కూతురు ఉన్నారు.

## ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి మృతి

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 15: పట్టణంలోని హమాలీవాడకు చెందిన తోగరి శ్రీధర్ (36) ఈ నెల 12న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కరీంనగర్‌లోని దవాఖానకు చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు మంచిర్యాల పట్టణ ఎస్ఐ రాములు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం అప్పుల బాధలు, ఫైనాన్స్ సమస్యలతో ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. ఈ మేరకు తండ్రి ఆంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. మృతుడికి భార్య సౌందర్య ఉన్నారు.



జెండా వందనం చేస్తున్న శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి



జెండా ఆవిష్కరిస్తున్న బెల్లంపల్లి ఏరియా జీఎం శ్రీనివాస్



జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న మందమర్రి జీఎం దేవేందర్



ఎస్టీపీపీలో పతాకావిష్కరణలో పాల్గొన్న ఈడీ రాజశేఖర్

## నల్ల నేలపై ఘనంగా పంద్రాగస్టు వేడుకలు

- జాతీయ పతాకాలను ఆవిష్కరించిన శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి ఏరియాల జీఎంలు

శ్రీరాంపూర్, ఆగస్టు 15: ఎందరో పోరాటయోధుల త్యాగాల ఫలితంగా మనం స్వాతంత్ర్య ఫలాలు పొందుతున్నామని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి పేర్కొన్నారు. గురువారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం వద్ద స్వాతంత్ర్య దినోత్సవంలో భాగంగా జాతీయ జెండాను విష్కరించారు. సింగరేణి సంస్థ కార్మికుల రక్షణ, సంక్షేమంతోనే ఉత్పత్తి ఉత్పదకతకు కృషి చేస్తున్నారని చెప్పారు. అనంతరం సింగరేణి పాఠశాల విదార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షురాలు రాధాకుమారి, ఏఐటీయూసీ నాయకులు, అధికారులున్నారు.

**జైపూర్‌లోని ఎస్టీపీపీలో..**

జైపూర్, ఆగస్టు 15: జైపూర్ సింగరేణి విద్యుత్‌కేంద్రంలో అడ్మిన్ బిల్డింగ్ వద్ద ఈడీ రాజశేఖర్ జెండాను ఆవిష్కరించి అధికారులు, ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు. ఎస్టీపీపీ విస్తరణలో 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన మరో ప్లాంట్ పనులు ప్రారంభమయ్యే అవకాశాలున్నట్లు తెలిపారు. అనంతరం ఉత్తమ ఉద్యోగులను సన్మానించారు. కార్యక్రమంలో జీఎం పీసీఎస్ శ్రీనివాసులు, చీఫ్‌ఆఫ్‌ఓఅండ్‌ఎం జైన్‌సింగ్, ఏఐటీయూసీ పిట్ సెక్రటరీ సత్యనారాయణ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**మందమర్రి ఏరియాలో..**

మందమర్రి, ఆగస్టు 15: మందమర్రిలోని ఏరియా జీఎం కార్యాలయం వద్ద జీఎం జీ.దేవేందర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఏరియా ఉత్తమ కార్మిక దంపతులను పూలమాలలు, శాలువాలతో సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. సింగరేణి పాఠశాల విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం రఘుకుమార్, ఎస్వోటూ జీఎం రాజేశ్వర్ రెడ్డి, ఏఐటీయూసీ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేశ్, సీఎంవోఏఐ అధ్యక్షుడు రమేశ్, పర్సనల్ మేనేజర్ శ్యామ్‌సుందర్, కేకే గ్రూప్ ఏజెంట్ రామదాసు, డీవైపీఎం ఎండీ ఆసీఫ్, ఏరియా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**బెల్లంపల్లి జీఎం కార్యాలయంలో..**

రెబ్బెన, ఆగస్టు 15: బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి జీఎం కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా జీఎం కార్యాలయం వద్ద బెల్లంపల్లి ఏరియా జీఎం శ్రీనివాస్ జెండా ఆవిష్కరించారు. ఏరియాలోని ఉత్తమ కార్మికులతో పాటు వారి కుటుంబ సభ్యులను శాలువాలు కప్పి సన్మానించారు. అనంతరం మొమెంటో అందించి ప్రశంసాపత్రాలు అందించారు. విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షురాలు ఉమారాణి శ్రీనివాస్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్.తిరుపతి, అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ వేడుకల్లో ప్రొటోకాల్ విషయంలో తమకు అవమానం జరిగిందని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ కార్యదర్శి ఎస్.తిరుపతి ఆధ్వర్యంలో యూనియన్ నాయకులు కార్యక్రమం నుంచి వెళ్లిపోయారు. సంబంధిత అధికారులు వారితో మాట్లాడి సముదాయించడంతో వివాదం సద్దుమణిగింది. ఖైర్‌గూడ ఓసీపీలో వేడుకలను ఘనంగా నిర్వహించారు.

## వ్యాపారి హత్య కేసులో నిందితుల అరెస్ట్

లక్షెట్టిపేట, ఆగస్టు 15: లక్షెట్టిపేట పట్టణంలోని గురునానక్ ఫంక్షన్‌హాలు సమీపంలో ఈ నెల 13న రాత్రి హాజీపూర్ మండలం సబ్బెపల్లికి చెందిన బోళ్ల వ్యాపారి చింతల దేవయ్య అలియాస్ దేవేందర్(37) హత్య కేసులో నిందితులను అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను గురువారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్ వెల్లడించారు. మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకోవడంతో ఆమె భర్త ప్రభాకర్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఇందుకు కారణమైన దేవయ్యపై ప్రభాకర్ సోదరులైన కోట సత్తయ్య, కోట అంజయ్య, కోట సాయిలు కక్ష పెంచుకున్నారు. తమ్ముడు చనిపోయాక కూడా వివాహేతర సంబంధం కొనసాగించడంతో పరువు పోతున్నదని భావించి దేవయ్యను చంపాలని వారు నిర్ణయించుకున్నారు. లక్షెట్టిపేటకు వచ్చిన దేవయ్యతో కలిసి నిందితులు మద్యం తాగారు. ఇంటికి వెళ్తున్న దేవయ్యను ఇనుప పైపుతో తలపై కొట్టి చంపారు. దేవయ్య భార్య రాజేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి 24 గంటల్లోనే నిందితులను పట్టుకున్న లక్షెట్టిపేట సీఐ నరేందర్, ఎస్ఐ సతీశ్ పీసీలు సంతోష్ నాయక్, తిరుపతి, అంజిబాబు, కుమారస్వామిని ఏసీపీ అభినందించారు.